www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 జులై 2025

5

తిరుపతి

స్కూలు తాళం తీయకుంటే కేసులు పెట్టండి! : డిఇఒ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా చంద్రబాబు సర్కారుపై రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రులు తిరుగుబాటు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడంతో కొన్నిచోట్ల ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏర్పేడు మండలంలోని పల్లంపేటలో విలీనానికి వ్యతిరేకంగా ప్రాథమిక పాఠశాలకు తల్లిదండ్రులు తాళాలు వేశారు. ఆరు రోజులైనా తాళాలు తీయకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు బడి బయటే నిరీక్షించి వస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి కేవీఎన్ కుమార్ శనివారం ఏర్పేడు ఎంఆర్సి కార్యాలయానికి విచారణకు వచ్చారు. ఎంఈఓ-1 ప్రేమలత, ఎంఈవో-2 దయాకర్ తో సమావేశమై పల్లంపేట ఘటనపై ఆరా తీశారు. సోమవారం నాటికి బడి తాళాలు తీయకుంటే తల్లిదండ్రులపై కేసు పెట్టమని ఆదేశించారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు ఆందోళన చేపట్టేలా ప్రోత్సహిస్తున్న విపక్ష నేతల పైనా ఆయన కేసులు పెట్టమన్నట్లు సమాచారం. 'మా ఊరి బడి మా ఊళ్లోనే ఉండాలి' అని కోరితే జైళ్లలో పెడతారా? అని తల్లిదండ్రులు, గ్రామస్తులు మండిపడుతున్నారు.

గుంపులు గుంపులుగా వెళ్లాల్సిందే..

అలిపిరి మార్గంలో బైకర్‌పై చిరుత దాడి ఘటన / మీడియాతో సబ్ డిఎఫ్ఓ నాగభూషణం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో శుక్రవారం సాయంత్రం అలిపిరి నుండి జూ పార్కుకు వెళ్లే మార్గంలో రాత్రి 7:30 గంటల సమయంలో ఆవైపు ప్రయాణిస్తున్న ఓ బైకర్ పై చిరుత దాడికి యత్నించింది. దీంతో ఒక్కసారిగా ఆ ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి వాహన వేగాన్ని పెంచి వేగంగా వెళ్ళిపోయాడు. ఈ దృశ్యం అంతా వెనుక వైపు వస్తున్న కారు డాష్ బోర్డు కెమెరాలో నిక్షిప్తమైంది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారడంతో అటవీశాఖ అధికారులు చిరుత సంచారం పట్ల తగిన జాగ్రత్తలు వహించి వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించాలని సూచించారు.

అలిపిరి మార్గాన్ని స్వచ్ఛతగా ఉంచితే....

అలిపిరి నుండి జూ పార్కు పోవు మార్గంలో తినుబండారాలను రోడ్డు పక్కన వేయడం, ఈ మార్గంలో చిరు తిండ్లు, టిఫిన్ వ్యాపారాలు చేసుకునేవారు ఆ వ్యర్థాలను ఆ పరిసరాలలోనే వేయడంతో వాటికోసం కుక్కలు, కుక్కలు కోసం చిరుత పులులు రావడం జరుగుతున్నట్లుగా గుర్తించామని తిరుపతి సబ్ డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగభూషణం వివరించారు. శనివారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి చిరుత ఓ ద్విచక్ర వాహన దారుడుపై దాడికి ప్రయత్నించడంపై వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలలో ప్రయాణించే వారిని గుంపులుగా ఏర్పాటు చేసి ఈ మార్గంలో ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల ఉన్న 2500 ఎకరాల చుట్టూ శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ అటవీ ప్రాంతం 94,000 ఎకరాల్లో రెండు జిల్లాలలో విస్తరించి ఉందని, ఇక్కడ 20 చిరుతపులులు, వాటి పిల్లలు ఉన్నాయన్నారు.

వారం, రెండు వారాల కొకసారి వచ్చిపోతున్నాయి....

శేషాచలం కొండల నుండి విశ్వవిద్యాలయాల ప్రాంగణంలోకి చిరుత పులి వారం, రెండు వారాలకు ఒకసారి అడవి నుండి చిరుత పులులు రోడ్డు దాటి విశ్వవిద్యాలయాల ప్రాంగణంలోని హాస్టల్స్ వద్దకు వచ్చి అక్కడే తిరుగుతున్న కుక్కలను వేటాడుతున్నాయి. ఇదివరకే చిరుత పులుల సంచారం నేపథ్యంలో గతంలో వధా అయిన ఆహారంను బయట పడేయొద్దని అక్కడి నిర్వాహకులకు చెప్పాం.

అలిపిరి నుండి జూ పార్కు వరకు ఉన్న మార్గంలో శానిటేషన్ను బాగువరిచి ఈ ప్రాంతంలో తిరుగుతున్న మూడు చిరుత పులులను బంధించడానికి ఇప్పటికే 3 బోన్లు ఏర్పాటు చేశామన్నారు. మనుషులపై దాడి అనేది చిరుత పులులు భయంతోనే చేస్తాయని, అందుకే తిరుమల కాలినడక మార్గంలో కూడా గుంపులు గుంపులుగా భక్తులను పంపుతున్నామన్నారు. టిటిడి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయ సమావేశాలను నిర్వహించి వన్యమగాల కదలికలపై భక్తులకు ఎటువంటి హాని కలగకుండా జాగ్రత్తలను తీసుకుంటున్నామన్నారు. వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా గైడ్ లైన్స్ ను అనుసరించి భక్తుల భద్రతకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తున్నాం.



డిఇఒకు వినతిపత్రం అందిస్తూ...

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తప్పించాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, నేతలు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల విషయంలో క్యాడర్ స్ట్రెంథ్ వివరాలు లేకపోవడం, పొజిషల్ ఐడిలు లేకపోవడంతో జూన్, జులై నెల జీతాలు చెలిలంచడానికి ఆటంకం ఏర్పడిందన్నారు. విద్యాశాఖ నిర్లక్ష్యం వల్ల నేటికీ జీతాలు అందలేదన్నారు. బోధనేతర పనులు,యాప్‌ల భారంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్-ఎస్ నాయుడు, గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులు కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారి మోహన్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు సురేష్, వెంకటకృష్ణ, అవనిగడ్డ పద్మజ, ఆదినారాయణ, ఆర్.నాగరాజు, ఎన్.మోహన్, చంద్రశేఖర్, భక్తవత్సలం, నరసింహ, గుణశేఖర్, మురళి పాల్గొన్నారు.

శివుని దర్శించుకున్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, టిడిపి సీనియర్ నేత కన్నలి ప్రతాప్ రెడ్డి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు, కలంకారి వస్త్రాన్ని అందజేశారు.

నేడు తిరుమలకు రాష్ట్ర గవర్నర్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలకు నేడు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నారు. ఉదయం 6:20 గంటలకు శ్రీపద్మావతీ అతిథిగహం చేరుకోనున్న గవర్నర్‌కు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించనున్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా టిటిడి, జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది.

నూతన సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకోవాలి

'టేప్ ఎక్స్‌పో' ప్రారంభోత్సవంలో సుగుణమ్మ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

భవన నిర్మాణ రంగంలో నూతన సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకోవాలని ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డెవలప్మెంట్ చైర్మన్ సుగుణమ్మ తెలిపారు. ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (ఎక్స్‌పో)తిరుపతి వారి ఆధ్వర్యంలో స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్ లోని పి. ఎల్. ఆర్. కన్వెన్షన్ సెంటర్‌లో శని, ఆదివారము రెండు రోజులు జరుగు టేప్ ఎక్స్పో 25 ఘనంగా ప్రారంభమయ్యింది. జిందాల్ స్టీల్స్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ ఎక్స్ పో లో 70 పైచిలుకు వివిధ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. వివిధ కంపెనీలకు చెందిన సాంకేతిక నైపుణ్యం గల నిష్ణాతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డెవలప్మెంట్ చైర్మన్ సుగుణమ్మ , రాష్ట్ర యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ , రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డెవలప్మెంట్ చైర్మన్ సి.ఆర్. రాజన్ , తిరుపతి మున్సిపల్ డిప్యూటీ మేయర్లు ఆర్ సి మునికృష్ణ, ముద్ర నారాయణ , జిందాల్ స్టీల్స్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా. సుగుణమ్మ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేయడం, అందులో విశిష్ట పరిజ్ఞానం కలిగిన నిపుణులు పాల్గొనడం శుభ పరిణామమని, ఇల్లు నిర్మించుకునే వారికి , వాటర్ ట్యాంకులు, ఆర్ సి సి స్లాబ్లు లీకేజీ నిర్మూలన కోసం పరిష్కారాలు ఉన్నాయన్నారు. ఖాళీ స్థలాలు, అపార్ట్మెంట్ల కొనుగోలుదారులకు మంచి వేదికని కొనియాడారు. తిరుపతి నగరవాసులు పరిసర ప్రాంతాల పుర ప్రజలు విజ్ఞానదాయకమైన టేప్ ఎక్స్పోను సందర్శించి సాంకేతిక విషయ పరిజ్ఞానాన్ని పొందే మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టేప్ చైర్మన్ వెంకటేష్ బాబు, అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

అధినేత మెప్పుకై ఆరాటం

సినీ ప్రచారాలు సరే.. ప్రజా సమస్యల మాటేంటి..?

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజల చేత.. ప్రజల కోసం... ప్రజలే ఎన్నుకోబడిన వారు ప్రజాప్రతినిధులు. కుల, మత, ప్రాంత, వర్గ భేదాలకు అతీతంగా సమాజాభివృద్ధికి కృషి చేయడం ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజల కోసం కాకుండా పార్టీల కోసం, అధినేతల మెప్పుకు, తమ స్వార్థ ప్రయోజనాల కోసం పని చేసేలా వ్యవహరిస్తుండడం శోచనీయం. ఇటీవల మరో అడుగు ముందుకేసి తమ పార్టీ అధినేత సినిమా ప్రచారం కోసం పాకులాడుతూ, ప్రోటోకాల్ సమయాన్ని పోస్టర్ల పబ్లిషిటికి వాడుకునేలా కార్యక్రమాలు చేయడం గమనార్హం. ఓ వైపు తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు తీరు ఇలా ఉంటే, మరోవైపు జనసేన నుంచి బహిష్కృతుడై కూడా రెండు రోజులుగా తిరుపతిలో కిరణ్‌రాయల్ చేస్తున్న ఆర్భాటం అంతాఇంతా కాదు.

పార్టీ అధినేతలు, రాజకీయ ప్రముఖులు, పార్టీ పెద్దల అండ కోసం పాకులాడటం ప్రతి బూర్జువా రాజకీయ పార్టీలో సర్వసాధారణమయ్యింది. పార్టీ పెద్దల ఆశీస్సులు కావాలంటే ప్రజల్లోకి వెళ్లి, నిరంతరం ప్రజాసేవ చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు ద్వారా రాజకీయాల్లో రాణించాల్సి ఉంటుంది. రాజకీయ నాయకులు చేసే కార్యక్రమాలు అటు పార్టీ ఎదుగుదలకు కానీ, ఇటు ప్రజల శ్రేయస్సుకోసం కానీ, సమాజాభివృద్ధికి దోహదపడేలా ఉండాలి. పార్టీ అధినేతల వ్యక్తిగత ఎదుగుదలకు ఉపయోగపడేలా ఉండడం సరైనది కాదు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ప్రముఖ సినీ హీరో కూడా. రాజకీయాలు వేరు.. సినిమాలు వేరు.. రాజకీయాలు ప్రజా సేవ కోసం, సినిమాలు వ్యక్తిగత ఆర్థిక ఎదుగుదల కోసం. ఒక డిప్యూటీ సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజా సమస్యలను పెద్దగా పట్టించుకోకుండా సినిమాలకు ప్రాధాన్యత ఇవ్వడమే పెద్ద తప్పు. అలాంటిది తన సినిమా ప్రచారాల కోసం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను వినియోగించడం శోచనీయం. డిప్యూటీ సిఎం నటించి, ఇటీవల విడుదలైన 'హరిహర వీరమల్లు' సినిమాపై సినీ వర్గాల్లో పెద్ద పెద్ద అంచనాలు ఉన్నాయి. అది చిత్రపరిశ్రమకు సంబంధించిన వ్యవహారం. కానీ ఆ సినిమా ప్రచారం కోసం తిరుపతికి చెందిన ఎంఎల్ఎ తానే స్వయంగా ప్రచార కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఓ పక్క ఉప ముఖ్యమంత్రే కల్పిత కథను, గత చరిత్ర అంటూ సినిమా ద్వారా ప్రజలను, సమాజానికి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తుంటే. ఏకంగా తిరుపతి ఎంఎల్ఎ తమ అధినేత సినిమా పెద్ద హిట్ కావాలని ప్రజాప్రతినిధి హోదాలో అలిపిరి పాదాల మండపంవద్ద భారీ సంఖ్యలో అభిమానులను పోగుచేసి కొబ్బరికాయలు కొట్టి, జేజేలు కొట్టారు. తమిళనాడు, కర్ణాటక, అనంతపురం, మదనపల్లి ప్రాంతాల నుంచి తిరుపతిలోకి ప్రవేశించే ప్రదాన రహదారుల్లో బాలాజీకాలనీ వద్దనున్న పూలే విగ్రహం నుంచి నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే టౌన్‌క్లబ్, ప్రకాశంరోడ్డు, గాంధీరోడ్డు, బండ్లవీధి, టిపి ఏరియా, గాంధీ విగ్రహం మీదుగా ఆర్‌టిపి బస్టాండు వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దీనికి పోలీసులు సైతం ఎలాంటి ఆంక్షలూ లేకుండా అనుమతులు ఇవ్వడం గమనార్హం. మరో పక్క నగరంలోని బైరాగిపట్టెడ, గ్రూప్ థియేటర్స్, కపిలతీర్థానికి చేరువలో ఉన్న అన్నారావు సర్కిల్ వంటి ప్రాంతాల్లో బాణాసంచా పేల్చి, పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆర్భాటాలు చేశారు. హీరోకు అభిమానో, పార్టీ కార్యకర్తో... సగటు ప్రేక్షకుడో సినిమా ప్రచారాలు చేశారంటే పర్వాలేదు. సాక్షాత్తు ప్రజాప్రతినిధి, ఎంఎల్ఎ స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రజల్లో చర్చకు తావిచ్చింది. గతంలోనూ చిత్రపరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి రాణించిన వారు ఉన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు, తెలుగు రాష్ట్రాల ప్రజలకు పరిచయం అవసరం లేని వ్యక్తి ఎన్‌టిఆర్. ఆయన తెలుగు రాష్ట్రాలనే కాదు, కేంద్ర రాజకీయాలను సైతం శాసించే స్థితిలో ఉన్నా, అడపదడప సినిమాలు చేస్తున్నా ఏనాడూ తమ పార్టీ నాయకులను, కార్యకర్తలను సినిమా ప్రచారాలకు వాడుకున్న దాఖలాలు లేవు. తెలుగు చిత్ర పరిశ్రమలో మెగాస్టారుగా ఎదిగి, ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో వచ్చిన చిరంజీవి కూడా ఇలాంటి ప్రచారాలు చేయలేదు. సూపర్‌స్టార్ కృష్ణ, కృష్ణంరాజు, మురళీమోహన్, మోహన్‌బాబు, జయప్రద, జయసుధ ఒకరేంటి ఎంతో మంది ఉద్దండులు చిత్ర పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి రాణించినా, తమ రాజకీయ ఎదుగుదలకు సినిమాని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలను వాడుకున్న సందర్భాలు లేవు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇలాంటి రాజకీయాలు చూడాల్సి వస్తుందంటూ సాక్షాత్తు ప్రజలే బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ఇక నైనా ప్రజాప్రతినిధులు ఇలాంటి వివాదాలకు దూరంగా ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి దృష్టిపెట్టి, ప్రజల మన్ననలను పొందేలా వ్యవహరించాల్సి ఉంది.

ప్రజాదృష్టి

విద్యుత్ సర్వీసుల కోసం రైతుల పాట్లు

అవసరం లేని ధ్రువ పత్రాల కోసం ఒత్తిళ్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వ్యవసాయానికి విద్యుత్ సర్వీసులు మంజూరు చేయడంలో శ్రీకాళహస్తి విద్యుత్తు శాఖాధికారులు కొర్రీలు పెడుతున్నారు. అవసరం లేని ధ్రువ పత్రాలు కావాలంటూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఫలితంగా సకాలంలో సర్వీసులు మంజూరు కాక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వ్యవసాయ బోర్లకు, బావులకు విద్యుత్తు లేనిదే నీటిని వినియోగించే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో సాగు కోసం వ్యవసాయ సర్వీసులకు దరఖాస్తు చేసుకుంటే ధ్రువ పత్రాల పేరిట రోజుల తరబడి కాళ్ళరిగేలా తిప్పించుకుంటున్నారని కర్షకులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో వ్యవసాయ విద్యుత్ సర్వీసు పొందాలంటే వాల్టా, వీఆర్వో, క్రాప్, భూమి పాసు పుస్తకం, వన్-బీ, కుల ధ్రువీకరణ, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, వినియోగదారు అంగీకార ధ్రువ పత్రాల అవసరం ఉండేది. ఈ ధ్రువ పత్రాలు పొందేందుకు రైతులకు తల ప్రాణం తోకలోకి వచ్చేది. ఈ సమస్య దష్ట్యా కూటమి ప్రభుత్వం నిబంధనలు మార్చి నాలుగు ధ్రువ పత్రాలకే పరిమితం చేసింది. వాల్టా, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, రైతు ఆధార్ కార్డు సమర్పిస్తే చాలు సర్వీసు మంజూరు చేయాలని చెప్పింది. అయితే శ్రీకాళహస్తి డివిజన్ విద్యుత్ శాఖలోని సెక్షన్ అధికారులు పాత పాటే పాడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సర్వీసుల మాంజూరులో జాప్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శ్రీసిటీలో తైవాన్ వ్యాపార ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్ దేశానికి చెందిన 14 మంది వ్యాపార ప్రతినిధుల బందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాక్స్ లిన్ నేతత్వంలో విచ్చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మార్మట్, శ్రీసిటీ తరుపు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. తైవాన్ కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్ తో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేయడాన్ని వారి దష్టికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు వికాస్ మర్మత్, రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్ ప్రతినిధి తో పాటు వర్చువల్ గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ బందంతో ప్రత్యేక చర్చలు జరిపారు. ఈ చర్చల్లో రాష్ట్రంలో పెట్టుబడి అనుకూల వాతావరణంతో పాటు ప్రధానంగా శ్రీసిటీ-కుప్పం కారిడార్‌లో వ్యాపార సౌలభ్యం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, బలమైన అనుసంధానం, ఇతర ప్రయోజనాలను ప్రస్తావించారు.

అదాని స్మార్ట్ మీటర్లు వద్దు : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు

'అదాని స్మార్ట్ మీటర్లు వద్దు... పాత ప్రభుత్వ మీటర్లనే కొనసాగించాలి' అని సిపిఎం నాయకులు మెలుగు రమేష్ ఆధ్వర్యంలో సత్యవేడు మండలం మధనంబేడు గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మెలుగు రమేష్ మాట్లాడుతూ అదాని స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలరైతుల, వ్యాపారవేత్తల జోబీలు చిల్లు పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అదానికి మేలు చేకూర్చే స్మార్ట్ మీటర్లను వేగంగా అమరుస్తోందన్నారు. యావత్ ప్రజానీకం ఈ ఘటనను గమనించి స్మార్ట్ మీటర్లను అమర్చడాన్ని అడ్డుకోవాలన్నారు. ఇప్పటికే అమర్చి ఉన్న స్మార్ట్ మీటర్లను తొలగించి తమ వ్యతిరేకతను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని విరమించుకొని, ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.లేకుంటే ముమ్ముందు ప్రజానీకాన్ని ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, రంజిత్, రాము, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఎపిపిఎస్‌సి డిపార్టుమెంట్ పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆదివారం 27వ తేదీ నుంచి ఆగస్టు 1 వరకూ జిల్లాలో ఎపిపిఎస్‌సి డిపార్టుమెంటల్ పరీక్షలు జరగనున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆదివారం జరగనున్న పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అబ్జెక్టివ్ టైప్ పేపర్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నమ 12 వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. అలాగే కన్వెన్షనల్ టైప్ పేపర్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం ఒక సెంటర్‌ఱు ఏర్పాటు చేశారని, 3,654 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్లు ఆర్ వెంకటరమణ, బివిఎస్ శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థినులపై వ్యాయామ ఉపాధ్యాయుని వీరంగం

ప్రజాశక్తి - కోట

కోట మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నందు చదువుతున్న విద్యార్థినిలపై అకారణంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు దారుణంగా కొట్టారు.ఈ సందర్భంగా శనివారం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉన్న విద్యార్థినిలు రోజువారి దినచర్యలో భాగంగా పాఠశాలకు వెళ్లారు. అయితే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు యూనిఫామ్ వేసుకోలేదనే కారణంతో అక్కడ పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్.సుభాన్ దారుణంగా విద్యార్థినిలను కర్రతో కొట్టి, మరికొంతమంది చేత సుమారు 100 గుంజిళ్లను తీయించారు. అయితే ఈ సంఘటన ఉదయం జరిగినా రాత్రి 7 గంటల వరకు ఎలాంటి సమాచారం బయటకు తెలియరాలేదు.అయితే రాత్రి 8 గంటల సమయంలో దెబ్బలు తట్టుకోలేక విద్యార్థినిలు ఒక్కొక్కరు వార్డెన్ తో చెప్పడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ పనిచేస్తున్న వార్డెన్ క్షుణ్ణంగా ఆరా తీయగా విద్యార్థినిలు బోరున ఏడుస్తూ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్సి హాస్టల్ విద్యార్థినిలు పైకి లేండి అని వ్యాయామ ఉపాధ్యాయుడు అడగడంతో విద్యార్థినిలు పైకి

అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలింపు

లేవడంతో ఒక్కసారిగా కర్రతో దారుణంగా కొట్టారని తెలిపారు. మరి కొంతమంది విద్యార్థినిలు చేత 100 గుంజిళ్లు తీపించారని బోరున ఏడుస్తూ వార్డెన్ కు చెప్పారు. హాస్టల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు పూర్తిగా స్పృహ కోల్పోయారు. మరో 30 మంది విద్యార్థినిలు కర్రతో కొట్టడంతో నొప్పులకు తట్టుకోలేక విలవిలలాడారు. తక్షణమే స్థానిక వార్డెన్ జరిగిన సంఘటనను స్థానిక మండల విద్యాశాఖ అధికారికి, అదేవిధంగా సాంఘిక సంక్షేమ పై స్థాయి అధికారులకు తెలియజేశారు. ఎట్టకేలకు దళిత నాయకులు జరిగిన విషయం తెలుసుకొని తక్షణమే సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నందు చేరి జరిగిన విషయాలను క్షుణ్ణంగా ఆరా తీశారు.చివరగా గాయాలైన ఆయా విద్యార్థినులను అంబులెన్స్ లో ఆసుపత్రులకు తరలించారు. పలువురు దళిత నాయకులు డాక్టర్ రామకృష్ణకు జరిగిన విషయాన్ని వివరించారు.

శ్రీసిటీలో చిన్మయ విద్యార్థుల భగవద్గీత పారాయణం

ప్రజాశక్తి - సత్యవేడు

శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం చిన్మయ విద్యాలయ విద్యార్థులు ఆలపించిన భగవద్గీత పారాయణం ఎంతగానో ఆకట్టుకుంది. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొని పారాయణం చేశారు. చిన్మయ మిషన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగమైనట్లు ఉపాధ్యాయులు పి.రామచంద్రన్, వి.సంధ్యారాణి పేర్కొన్నారు. శ్రీవాణి నిర్వాహకులు విద్యార్థులకు ప్రత్యేక బహ

భూ సారం పెంపుకు నవధాన్యాలు శ్రేష్ఠం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: భూ సారాన్ని పెంపొందించడానికి నవధాన్యాలు విత్తడం శ్రేష్ఠమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం పిచ్చాటూరు మండలం కీలపూడి రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ నవధాన్యాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో నవధాన్యాలు విత్తడం వల్ల పచ్చి రొట్ట విత్తనాలు విత్తినంతగా భూమి సారవంతమవుతుందన్నారు. నవధాన్యాలు ఒక బ్యాగు ధర రూ.650లు అని, రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహమ్మద్ రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు పద్మ రాజు, డిల్లీ బాబు, ఏఏఓ, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు మండలం, కీలపూడి రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీ నవధాన్యాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

రైతు భరోసా కేంద్రాలలో పచ్చి రొట్టె విత్తనాలు అందుబాటులో ఉన్నాయి : వ్యవసాయ అధికారి షణ్ముగం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు బుచ్చినాయుడు కండ్రిగ మండల వ్యవసాయ అధికారి షణ్ముగం ఒక ప్రకటనలో తెలియజేశారు. పచ్చి రొట్టి విత్తనాలకు సంబంధించిన జీలగులు 10 కేజీలు 615 రూపాయలు, సీఎండీఎస్ కిట్లు ఒక్కొక్కటి 10 కేజీలు ఎకరాకు 650 రూపాయలు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవలసినదిగా తెలియజేశారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్కు తీసుకొని ఆన్లైన్లో బయోమెట్రిక్ వేసి, పచ్చి రొట్టె విత్తనాలు రాయితీలో పొందవచ్చని తెలిపారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కీర్తిశేషులు పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సంపూర్ణ సహకారంతో శనివారం ప్రగతి కార్యాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని నిరుపేదలైన 15 కుటుంబాలకు 18 రకాల ఫల సరుకులనుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పోనకా మల్లికార్జున్ రెడ్డికి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు మెడనూరు సురేష్ రెడ్డి, కోటా వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణం, ఇందిరానగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీకంటి రామ్మోహనరావు దాతృత్వంతో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వెస్ట్ క్లబ్ అధ్యక్షులు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన విద్యా సామాగ్రిని అందించేందుకు రోటరీ వెస్ట్ క్లబ్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కందాటి రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిహారం ఇవ్వండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నగర పరిధలోని సబ్ కలెక్టర్ కార్యాలయం పద్ద సాగర మాల ప్రాజెక్టుకు సంబంధించిన భూములకు పరిహారం కోరుతూ, కోట మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు అనంతరం. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను కలసి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు తీసుకుని పరిహారం ఇవ్వకుండా, అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. పరిహారం ఇవ్వలేదని రోడ్డు నిర్మాణ పనులను కూడా అడ్డుకున్నామని తెలిపారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పి4 సర్వేపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం దారిద్రరేఖ దిగువనున్న బంగారు కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శకులను గుర్తించాలని తిరుపతి రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ సూచించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పి ఫోర్ సర్వే పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నారైలు, ఆర్థికవేత్తలు, భూస్వాములు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంఘ సేవకులను ఆగస్టు 4వ తారీఖు లోగా మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఆ బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దారులు అన్వర్ భాష, అమృత, యుగంధర్, డిప్యూటీ మండల సర్వేయర్ తరుణ్, వీఆర్వో ప్రదీప్ నాయుడు, రమాదేవి, రూప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్యదర్శిలు, వీఆర్వోలు, సర్వేయర్లతో, మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో పి ఫోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గుర్తించిన 2551 బంగారు కుటుంబాలను, ప్రజా ప్రతినిధులకు, పారిశ్రామికవేత్తలకు, ఔత్సాహికులు దత్తత తీసుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. 4వ తేదీలోగా ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

కలాం ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరూ అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగించాలని ఏడోవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ పేర్కొన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 10 వ వర్ధంతిని పురస్కరించుకొని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడూరు కోర్టు సముదాయంలో ఏడవ అదనపు జిల్లా జడ్జి గూడూరు వెంకట నాగ పవన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అట్రాసిటీ సభ్యులు అరవ పార్వతయ్య, సయ్యద్ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు శ్రేష్ఠం

ప్రజాశక్తి - రేణిగుంట: ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేసుకోవాలని హెల్త్ సూపర్వైజర్లు పుష్పావతి, శివ శంకర్ తెలియజేశారు. శనివారం వెదల్ల చెరువు ఎస్టీ కాలనీని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో గర్భవతులు నమోదు చేసుకోవాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలోని కాన్పు అయితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. అత్యవసరం అయినప్పుడు 108 వాహనాన్ని ఉపయోగించుకుని ఆసుపత్రులకు వస్తే సకాలంలో ఆసుపత్రుల్లోనే కాన్పు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. మేఘనాథ్, మహిళా పోలీస్ పూర్ణిమ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సౌందర్య, ఆశా కార్యకర్త కుమారి, రాస్ స్వచ్ఛంద సంస్థ ఎడ్యుకేషన్ ఫీల్డ్ కోఆర్డినేటర్ భారతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి - రేణిగుంట: గంజాయి మొదలైన మారకద్రవ్యాలపై శనివారం రేణిగుంట రైల్వే స్టేషన్, బస్టాండ్ కూడలి వద్ద, తిరుపతి రూరల్ ఎక్సైజ్ స్టేషన్ సిఐ నరసానాయుడు, ఎస్సై అంజలి ప్రసన్నలు తమ సిబ్బందితో కలిసి డ్రగ్స్‌కి సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. సిఐ నరసప్ప నాయుడు మాట్లాడుతూ రేణిగుంట రైల్వే స్టేషన్, బస్టాండ్లలో ఒడిశా, ఇతర రాష్ట్రాల నుండి రైలులో గంజాయిని తీసుకొని వచ్చి తిరుపతిలో సప్లై చేస్తున్నట్లు సమాచారం ఉన్నదన్నారు. కావున ఎవరైనా అనుమానస్పదంగా కనబడితే సమాచారం అందించాలని తెలిపారు. ముఖ్యంగా ఆటోవాలాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాచారాన్ని 9440902543కు గానీ లేదా 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కి తెలుపాలని కోరారు.

మొక్కను పెంచడానికో పాస్ పోర్ట్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:



మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించేందుకు తరగతుల వారీగా విద్యార్థులకు పచ్చని మొక్కలను అందించి, గ్రీన్ పాస్ పోర్ట్ పేరుతో ఒక పుస్తకాన్ని శనివారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలవిద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఎకో క్లబ్ సమన్వయకర్త లక్ష్మయ్యలు అందించారు. ఈ పాస్ పోర్ట్‌లో మొక్క వ్యవహార నామం, సాంకేతిక నామం, ఏ తేదీన, ఏ ప్రాంతంలో మొక్కను నాటారనే వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. విద్యార్థులు తమకు ఇచ్చిన మొక్కకు వారి తల్లి పేరు పెట్టి, కుదిరిన చోట నాటాలి. తర్వాత ప్రతి మూడు నెలలకోసారి దాని ఎదుగుదల స్థితిని పాస్ పోర్టులో నమోదు చేస్తారు. సంవత్సరానికి రెండు సార్లు ఉపాధ్యాయుడు వీటిని నిర్ధారించి సంతకం చేయాల్సి ఉంటుంది. 'మొక్క ఎదుగుదలతో నా 'ప్రయాణం' అనే వాక్యంతో ఉన్న ఈ పాస్ పోర్టు విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, దాసు, సుజన తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : చిన్నగొట్టిగల్లులో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండల పరిధిలోని అనుపల్లెలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధిని వివరించారు.

ప్రజాశక్తి - నాగలాపురం: శనివారం నాగలాపురంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం అట్టహాసంగా సాగింది. నాగలాపురం, ఆర్టీసీ బస్టాండ్ నుండి గాంధీ విగ్రహం వరకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మండల కార్యాలయం ద్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి, మండలంలోని 19 పంచాయిలకు చెందిన మహిళా సంఘాలకు రూ.2 కోట్లు శ్రీనిధి చెక్కులను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - వాకాడు: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వాకాడు మండలంలో శనివారం ముట్టంబాక, కల్లూరు కొత్తపాలెం గ్రామాలలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పర్యటించారు. ఆయనకు వాకాడు సొసైటీ చైర్మన్ ఉచ్చూరు ప్రసాద్ రెడ్డి, దువ్వూరు జనార్దన్ రెడ్డి స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం 6వ వార్డు, పద్మశాలి పేటలోని ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, పేటా బాలాజీ రెడ్డి, మునిరాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్.సి.సి కేడెట్ల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ఎన్సిసి కోఆర్డినేటర్ మైమూన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ విజయ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కార్గిల్ విజయ దినోత్సవంను పురస్కరించుకొని కార్గిల్ అమరవీరుల స్మారకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డా.టి నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపల్ జి భద్రమణి, కళాశాల సీఓఈ విద్యుల్లత, ఎన్ సి సి – సిటిఓ సిహెచ్ సుహాసిని, అధ్యాపకులు టీ హేమలత, ఎన్ సిసి విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో బాలిక జీవిత, తండ్రి జయచంద్రకు రూ.2,70,406 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిచ్చాటూరు మండలం, వెంగలత్తూరుకు చెందిన చిన్నారి జీవిత చికిత్స కోసం అప్పులు చేసిన తండ్రి జయచంద్ర తనను ఆశ్రయించి ఆదుకోవాలని కోరారన్నారు. ఆసుపత్రి ఖర్చుల బిల్లులను సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇళంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు పద్మ రాజు, రాజేశ్వరి, రాజేంద్రన్, డిల్లీబ్బాబు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి మెడికల్ చెకప్

ప్రజాశక్తి - రేణిగుంట : తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) సిబ్బందికి అమర హాస్పిటల్‌లో శనివారం మెగా మెడికల్ చెకప్ నిర్వహించారు. ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఉత్తర్వుల మేరకు, టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ పోలీసులు, అటవీ శాఖ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పూర్తి స్థాయి మెడికల్ చెకప్‌లు చేపట్టారు. శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, హాస్పిటల్ ఎండీ డాక్టర్ గౌరినేని రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండటమే జీవితంలో నిజమైన విజయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బాలిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు కృపానంద తదితరులు పాల్గొన్నారు.

నేడు నాయుడుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ : నాయుడుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ సురేష్ బాబు ఒక శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొని మండలంలో అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డిని కలిసిన కోటేశ్వరరావు

ప్రజాశక్తి -కోట : ఎన్టీసీసీ మాజీ వైస్ చైర్మన్, ఊనుగుంటపాలెం సొసైటీ చైర్మన్ నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డిని శనివారం కోట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కోటేశ్వరరావు మర్యాదగాపూర్వకంగా కలిశారు. ఇటీవల ఉనుగంటపాలెం సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తిరుమల శెట్టి కోటేశ్వరరావు పార్టీ బలోపేతానికి సమర్థవంతంగా కృషి చేస్తారని తెలిపారు.

కననంబేడు దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: అధిక ధరలపై మోడీ సర్కార్ ప్రజల్ని ఘోరంగా మోసం చేసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మండిపడ్డారు. శనివారం బిఎన్ కండ్రిగ మండలం సిపిఐ మండల మహాసభ కత్తి ధర్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ దేశంలో అవినీతి పెరిగి పోయిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతూ మోసకారి పాలన చేస్తున్నారని తెలిపారు. కననం బేడు దళితులు గత నాలుగు నెలలుగా తమ అనుభవంలో భూమికి ఇంటి పట్టాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ మహాసభలో రమణయ్య, సుబ్రమణ్యం, షణ్ముగం, గోవిందయ్య, రాఘవయ్య, చంద్రమ్మ, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమ శిక్షణాంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించడం ద్వారా గ్రామ రూపురేఖలను మార్చవచ్చని తెలిపారు. దీనికి సహాయ, సహకారాలు అందిస్తామని తెలియజేశారు. త్వరలో గ్రామాలలో పర్యటించి, మహిళలతో చర్చించి, అభివృద్ధి పనుల ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు మండలాధ్యక్షులు, మాస్టర్ ట్రైనర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి గన్ మెన్ తొలగింపు సరికాదు : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్ మెన్ కాలేషా తొలగింపు సరైనది కాదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చెయ్యి ప్రాక్షర్‌తో ఇబ్బందు పడుతున్న మాజీ మంత్రి పెద్దరెడ్డికి సహాయం చేశాడని గన్ మెన్‌ను సస్పెండ్ చేస్తూ చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశాలు ఇవ్వడం శోచనీయమన్నారు. జైలు పరిసర ప్రాంతాల్లో ఇతరులను ఎవరిని అనుమతించరని, అందుకే గన్ మెన్‌ను తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఎస్పీ మణికంఠకు ప్రభు భక్తి ఉంటే కార్యకర్తలగా ఉండాలి, అధికారిగా వుంటూ ప్రభుత్వానికి లొంగి ఉండాల్సిన పనిలేదని విమర్శించారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కండి : కమిషనర్ మంజునాథ్ గౌడ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని, పుత్తూరు పట్టణంలోని ధనికులకు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పి4 కార్యక్రంతో ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. 2029 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా నిర్ణయించబడిందన్నారు. ఈ విధానం ద్వారా సమాజంలోని ధనికులు పేద కుటుంబాల మెంటార్స్ (గ్రైడ్స్)గా వ్యవహరించి, వారికి సహాయం చేయాలని సూచించారు. పి -4 విధానానికి మద్దతు ఇచ్చేందుకు రూ.2000 కోట్ల వీజీఎఫ్ నిధులు ప్రభుత్వం కేటాయించిందని, దీని ద్వారా పీపీపీ ప్రాజెక్టులు నిరోధకత్వ రహితంగా విజయవంతం కావాలని భావించారన్నారు. గ్రామ, వార్డు స్థాయిలలో ప్రారంభ దశలో పేద కుటుంబాలను గుర్తించడానికి సర్వేలు నిర్వహించాలన్నారు. పట్టణంలోని ధనికులు ఒక్కో పేద కుటుంబాన్ని దత్తత తీసుకుని నిరుపేదలను ఉన్నత స్థితికి తీసుకుని రావడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

పసలేని సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : మండల సర్వసభ సమావేశం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మ ప్రియ అధ్యక్షతన నిర్వహించారు. మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాగా సర్పంచు ఎంపీటీసీలు గైహాజరు కావడంతో సమావేశం ఆశించిన స్థాయిలో నిర్వహించలేకపోయారు. ఉద్యానవన శాఖకు సంబంధించిన అధికారులు మాట్లాడుతూ పండ్లకు సంబంధించిన చెట్లను పెంచడంతో ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని వివరాలు తెలియజేశారు. ఉపాధి హామీ శాఖకు సంబంధించి ఐదువేల మంది ఉపాధి హామీ కూలీలు నమోదు చేసుకోగా సుమారు 2000 మంది పైగా తమ కార్డులను ఉపయోగించుకోకపోవడం లేదని అధికారులు తెలిపారు. తహశీల్దార్ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలం కొరకు ఎవరైనా అర్జులు ఉంటే వీఆర్వోల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. సంత వేలూరు-సూళ్లూరుపేటకు ప్రారంభించిన బస్సు సర్వీస్‌ను వినియోగించుకోవాలని కోరారు. నామమాత్రంగా సమావేశాన్ని ఎంపీడీవో ప్రసాద్ ముగించేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతుల బాధలు ప్రభుత్వాలకు పట్టవా..? : తులసి రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రైతుల బాధలు ఏ మాత్రం పట్టడం లేదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసి రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మిర్చి, పొగాకు, మామిడి, పసుపు, చీనీ రైతులు ఏమర ఇబ్బందుల్లో గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఓవైపు గిట్టుబాటు ధర లేక రైతు విలవిలాడుతుంటే పంటల బీమా ప్రీమియం పెంచడం భావ్యమా అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. పంటల బీమా పథకం అమలు కావడం లేదని, ఇన్పుట్ సబ్సిడీ అందడం లేదని, యూరియా కొరత తీవ్రంగా ఉందని, ధరలు పెరిగాయని తెలిపారు. అన్న దాత సుఖీ భవ పథకం అమలు ఎప్పుడని ప్రశ్నించారు. మరో వైపు కేంద్రం 15 వ ఆర్థిక సంఘం నిధులు గత సెప్టెంబర్ నెలలో రూ.989 కోట్లు, డిసెంబర్ లో రూ.1121 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసిందన్నారు. 10 రోజుల్లో ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు అభివృద్ధి కోసం విడుదల చేయాల్సిఉన్నా, ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తిరుపతి సిటీ ప్రెసిడెంట్ జి.చిట్టిబాబు, పీసీసీ సెక్రటరీ టి. వెంకట నరసింహులు, అధ్యక్షులు చంద్రశేఖర్, చంద్రగిరి ఇంచార్జి లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం కోర్సుల రద్దు పోరాటంలో ఎస్ఎఫ్ఐ విజయం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో ఎన్విపి 20-20 కార్యక్రమంలో భాగంగా ఎస్వియూ ఉన్నతాధికారులు ఆన్లైన్ స్వయం కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ స్వయం కోర్సులలో క్రెడిట్ పాయింట్లు ద్వారా పాస్ అయితే పీజీ సర్టిఫికెట్ వచ్చేలా అకాడమిక్ కౌన్సిల్లో నిర్ణయం తీసుకున్నారు. ఈ స్వయం కోర్సులకు 1000 నుంచి 5000 రూపాయల వరకు ఫీజులు చెల్లించవలసి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థి మళ్ళీ అంతే ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ఆన్లైన్లో కోర్సులు అర్థం కాలేదని, పేద, గ్రామీణ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలపై స్ప

వెలుగు ఆర్థిక కార్యకలాపాలపై ఆడిటింగ్

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) ఆర్థిక కార్యకలాపాల సంబంధించి ఆదాయ వ్యయాలపై శనివారం ఆడిటింగ్ ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీశక్తి భవనంలో వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ పర్యవేక్షణలో ఆడిటర్ కార్తికేయ బృందం ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండల మహిళా సమైక్య ఆదాయ, వ్యయాలు, శ్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి వంటి పథకాలు సంబంధించి 42 గ్రామ సమైక్య సంఘాల ఆర్థిక వ్యవహారాలతో పాటు పాలడైరీ ఆదాయ, వ్యయాలకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిటింగ్ కొనసాగుతోంది. ఇందులో భాగంగానే తొలి రోజు సంఘమిత్రలు పలువురు ఆడిటర్కు రికార్డులు, ధ్రువపత్రాలు సమర్పించి ఆడిటింగ్ పూర్తి చేసుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు కోఆర్డినేటర్లు శివకుమార్, పురుషోత్తం,మధుసూదన్,పుల్లయ్య,మంగయ్య, బిఎన్ కండ్రిగ కోఆర్డినేటర్ పలని తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సురేష్‌కు అభినందన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:తిరుపతి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఓంకార్ రిటైర్మెంట్ తర్వాత నూతనంగా ఆస్థానంలో బాధ్యతలు చేపట్టిన సురేష్ కుమార్‌కు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, వేణుగోపాల్, స్విమ్స్ నాయకులు రవి, సూరి, మారి ముత్తు, భాష, జనార్ధన్, వెంకటేష్‌లు అభినందనలు తెలియజేశారు. కార్మిక సమస్యలను పరిష్కారం చేయాలని స్విమ్స్ కార్మిక సమస్యలు కూడా డిజిటల్ కార్యాలయంలో వాయిదా నడుస్తున్నదని ఆ సమస్య పట్ల కూడా సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శనివారం బి. ఎన్ కండ్రిగ మండలం, పార్లపల్లిలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ సత్యవేడు ఇంచార్జ్ నూకతోటి రాజేష్, మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు, వైస్ ఎంపిపి బాబు రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సీఎం సూపర్ సిక్స్ హామీలని మోసం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో బిరేంద్ర రాజు, భాను ప్రకాష్ రెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీయూ పరీక్షల విభాగంలో తనిఖీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు శనివారం పరిపాలనా భవనంలోని పరీక్షల విభాగాన్ని తనిఖీ చేశారు. పరీక్షల షెడ్యూలు, త్వరలో జరగనున్న పరీక్షల ఫీజుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గుర్తించారు. సంబంధిత అధికారులను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయంలో పరీక్షల విభాగం కీలకమైనదని ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, అవినీతికి చోటు లేకుండా నిబద్ధతతో పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు.

ధ్యానం, యోగంతో స్ఫూర్తిదాయక జీవితం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : త్రినేత్ర పిరమిడ్ దివ్య ధ్యాన దేవాలయం, పుత్తూరులో శనివారం ధ్యాన సత్సంగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈస్ట్ గోదావరి జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ గణేష్ మాస్టర్ పాల్గొని, ఆనందంగా ఎలా జీవించాలి? ఆదర్శంగా జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి?" అనే అంశాలపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. ధ్యానం, యోగం, ఆధ్యాత్మిక సత్సంగాల ద్వారా ప్రశాంత జీవనాన్ని అనుభవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.

28 నుండి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ 2025

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):ఈనెల 28 నుండి 31వ తేదీ వరకు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ 2025 ను చిత్తూరు డిస్ట్రిక్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చిత్తూరు డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ కృష్ణ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఛాంపియన్ షిప్‌కు దేశవ్యాప్తంగా టాప్ టెన్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు వస్తున్నారని, 400 మంది క్రీడాకారులు తమ ప్రతిభను చూపి విజేతలైన వారు జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడను ఆడడానికి అర్హత సాధిస్తారన్నారు. ఈ క్రీడలను ప్రారంభించడానికి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, పార్లమెంటు సభ్యులు గురుమూర్తి, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు హాజరై ప్రారంభిస్తారన్నారు. 31న జరిగే ప్రైస్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతి ప్రధానం చేస్తారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రావు, కోశాధికారి శివయ్య, ఈసీ మెంబర్ మునస్వామి పాల్గొన్నారు.

38వ రోజూ నిరసన దీక్షలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: సిఐటియు ఆధ్వర్యంలో అక్రమాల రామారావుని, గత పది సంవత్సరముల నుండి వెంకటగిరి లోనే తిష్ట వేసి ఉన్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 38వ రోజుకు చేరాయి. ఏకలవ్య ఏరుకుల సంక్షేమ సంఘం వారు శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలిపారు. రామారావును బదిలీ చేసేంతవరకు ఏకలవ్య ఏరుకుల సంక్షేమ సంఘం కూడా మున్సిపల్ కార్మికులకు మద్దతుగా న్యాయపోరాటం కొనసాగిస్తుందన్నారు. సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని పారిశుధ్య విభాగం నుండి తప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఏరుకుల సంక్షేమ సంఘం నాయకులు ఏసురాజా నాగమ్మ, లక్ష్మి, మున్సిపల్ యూనియన్ నాయకులు సుబ్బయ్య ప్రసాద్, సుబ్రహ్మణ్యం రమణయ్య, సీనయ్య, మనీ మాధురి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి దర్గాలో అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం రాత్రి నిషాన్ కార్యక్రమం జరిగింది. ముందుగా ఫకీర్ల మేళ తాళాలతో జరబు విన్యాసాలతో దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో హజరత్ సయ్యద్ హషిమ్ హుస్సేని రహమతుల్లా అలై వారి దర్గా నుండి నిషాన్ జెండాను హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి దర్గా వద్దకు తీసుకువచ్చి మత గురువులు మగ్దూమ్ అలీ షా చిష్టి వుల్ ఖాదరి, దిల్దార్ అలీషా బాసిత్, ఖమర్ అలీషా, మజహర్ అలీషా,మస్తాన్ ఖాదరిల ప్రత్యేక ప్రార్థనలతో నిషాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం హజరత్ వారి మజార్ సమాధి వద్ద సలాములు జరిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ముజావర్ మత గురువు మగ్దూమ్ అలీ షా మాట్లాడుతూ దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్‌ల సూచనల మేరకు దర్గా ఆవరణములో నిషాన్ జండా కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో చిష్టియా ఖాదరియా మత గురువుల ప్రార్థనలతో తమిళనాడు ఫకీర్ల బృందం వారి జరబులతో నిషాన్ కార్యక్రమం జరిగింది. ఆగస్టు 13వ తేది బుధవారం గంధమహోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు షేక్ షానవాజ్, సంధాని బాషా, గోల్డెన్ గౌస్, షబ్బీర్, యస్దాని, సైదులు మతగురువులు మగ్దూమ్ అలీ షా చిష్టి ఉల్ ఖాదరి, దిల్దార్ అలీ షా బాసిత్, ఖమర్ అలీషా అంజద్, మస్తాన్ ఖాదరి,మజహర్ అలీ షా, ఫయాజ్,షాజహాన్, కరిముల్లా, అబ్దుల్లా,అల్లావుద్దీన్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో

ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగ అసోసియేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ :మహిళా వర్సిటీలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగ అసోసియేషన్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ లోని ఆర్ అండ్ డి – న్యూ మెటీరియల్స్, టెస్టింగ్ విభాగానికి చెందిన డా. శ్రీధర్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ "ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్" పై ఆసక్తికరమైన ఉపన్యాసం ఇచ్చారు. ఆయన విద్యార్థి అసోసియేషన్ల ప్రాముఖ్యతను వివరించారు. వాటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎలా అభివృద్ధికి దోహదపడతుందో చెప్పారు. అలాగే, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల గురించి వివరించి, విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం వివిధ కెరీర్ మార్గాలను అన్వేషించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పి. మల్లికార్జున, డా. డి. హిమబిందు, డా. ఎస్. శృతి, డి. నర్మిత, సి హెచ్.సిరి చందనా, సివి. స్వేత మరియు బి.వి.వి. సంగణ శ్రీ లు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, అశోక్ నగర్ సెక్టార్, అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య పై తల్లులకు అంగన్వాడీ సూపర్ వైజర్ సుజన అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు అమ్మే మొదటి గురువని, పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తులసి, ఉమ పాల్గొన్నారు.

ప్రాణాన్ని కాపాడేది హెల్మెట్టే

ప్రజాశక్తి - వాకాడు : తిరుపతి జిల్లా, వాకాడు మండల పరిధిలోని వాకాడు బీసీ కాలనీ వద్ద శనివారం వాహనాలను వాకాడు ఎస్సై నాగబాబు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాని, అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో వాకాడు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పరుశురామేశ్వరుడి సేవలో నటి నిరోషా

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరుని దర్శనార్థం తెలుగు చలనచిత్ర నటి నిరోషా తన స్నేహితురాలితో కలిసి విచ్చేశారు. వీరికి ఆలయ ఈవో రామచంద్రారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతించి స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం అర్చకులు పవన్ కుమార్ శర్మ ఆలయ చరిత్రను, విశిష్టతను తెలియజేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వారపు సంతలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - రేణిగుంట:రేణిగుంట పట్టణంలోని వారపు సంతలో శనివారం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌కు ఆటకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసరావు మాట్లాడుతూ వారపు సంతలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వ్యాపారస్తులకు మ్యాపింగ్ చేసి వారికి కేటాయించిన స్థలాలను వాళ్లు అక్కడ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లపై దుకాణాలు రాకుండా పాదాచారులు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పంచాయతీ సెక్రెటరీ, ఎస్సై అరుణ్ కుమార్, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

అమరంకండ్రిగలో ధ్యానాశ్రమం వార్షికోత్సవం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీలో అమరంకండ్రిగలోని శ్రీ మహావతార్ బాబాజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమం నాల్గవ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబ్ నగర్, తెలంగాణ నుంచి ధ్యానధర్మ ఆశ్రమ నిర్వాహకులు అర్చన రాజ్, రాము విచ్చేయనున్నారు. విశ్వవ్యాప్త పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకులు పితామహ పత్రీజీ ఆవిష్కృతమైన ఈ పిరమిడ్ వార్షికోత్సవంలో పాల్గొని ఆరోగ్యమయమైన, ఆనందభరితమైన జీవితాన్ని అనుభవించేందుకు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే అని ఆశ్రమ నిర్వాహకులు శంకర్ నాయుడు, నాగరాజా, గిరి వర్మలు తెలిపారు.

హరిహర వీరమల్లు చిత్రం ఘనవిజయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనసేన అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో అభిమానులను అలరించే విధంగా ప్రదర్శింపబడి ఘన విజయాన్ని సాధించిందని జనసేన పార్టీ తిరుపతి నగర అధ్యక్షులు రాజారెడ్డి అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జనసేన నాయకులతో కలిసి రాజారెడ్డి మాట్లాడారు. హరిహర వీరమల్లు చిత్రంపై సామాజిక మాధ్యమాల వేదికగా చేయడం మంచి పద్ధతి కాదని, ఈ చిత్రంలో ఏ సన్నివేశమైన కించపరిచేలా ఉంటే బహిరంగ డిబేట్ కు తాము సిద్ధమన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఎదుర్కోలేకనే ఆయన చిత్రంపై వ్యంగ్యంగా సామాజిక పోస్టులు పెడుతున్నారన్నారు. చిత్రం విడుదలైన రెండు రోజుల వ్యవధిలోని రెండు తెలుగు రాష్ట్రాలలో కలెక్షన్ల సునామీ సృష్టించిందన్నారు. కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూడవచ్చన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాజేష్ ఆచారి, బాబ్జి, పగడాల మురళి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.